ప్రగతి వీచిక

- మారిన 90వ వార్డు రూపురేఖలు
- రూ.3.57 కోట్లతో మౌలిక వసతుల కల్పన
- ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం
- మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ



గవర వీధిలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్

విశాఖ విద్య: ప్రజలు అవసరాలు తీర్చేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టింది. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇచ్చింది. దీనిలో భాగంగా గతంలో ఎన్నడూ లేని రీతిలో పార్కులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దీంతో 90వ వార్డులు ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.



ఎయిర్ పోర్టు సమీపంలో నిర్మించిన బస్ షెల్టర్

ఇదీ పరిస్థితి

ఎన్ఏడీకి ఓ వైపు ఉండే 90వ వార్డు రూపురేఖలు ప్రభుత్వం మార్చింది. సుమారు రూ.3.57 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా జీవీఎంసీ అధికారులు నిధుల మంజూరుకు ప్రాధాన్యం ఇచ్చారు. డ్రైనేజీల నిర్మాణం, అవసరమైన చోట్ల రహదారుల పునర్నిర్మాణం చేశారు. పార్కుల అభివృద్ధితో వార్డు రూపురేఖలు మారాయి.



కాకాని నగర్‌లో నిర్మించిన సిమెంట్ రోడ్



ఏపీఎస్ఈబీ కాలనీలో నిర్మించిన డ్రైనేజీ

వార్డులో చేపట్టిన అభివృద్ధి పనులు ఇవే..

- ఎన్ఏడీ నుంచి పెందుర్తి వైపు రహదారి మరమ్మతులు : రూ.9.80 లక్షలు
- ఎన్ఏడీ నుంచి గోపాలపట్నం వైపు బీఆర్‌టీఎస్ రోడ్ డివైడర్స్ పెయింటింగ్, ఫుట్‌పాత్‌ల సుందరీకరణ: రూ.18 లక్షలు
- లక్ష్మీ నగర్ ఎఫ్ బ్లాక్ సీసీ రోడ్స్, సైడ్ డ్రైన్స్: రూ.6.35 లక్షలు
- ఎన్‌సీటీఎల్ గేటు నుంచి ఎన్‌హెచ్–16 వరకు పరిశుభ్రత, మొక్కలపెంపకం : రూ.15.35 లక్షలు
- వంశీ సూపర్ మార్కెట్ నుంచి బీఆర్‌టీఎస్ రోడ్ పునర్నిర్మాణం: రూ. 19.50 లక్షలు
- ఏపీఎస్ఈబీ కాలనీ రమ్య బేకరీ నుంచి ఆర్చి వరకు రోడ్డు నిర్మాణం : రూ.19.97 లక్షలు
- తహసీల్దార్ కార్యాలయం నుంచి బీఆర్‌టీఎస్ రోడ్డు వరకు మరమ్మతులు: రూ.14.90 లక్షలు
- సెయింట్ ఆన్స్ స్కూల్ నుంచి చెఫ్ హోటల్ వరకు రోడ్డు నిర్మాణం: రూ.15 లక్షలు
- ఎన్ఏడీ నుంచి పెందుర్తి వైపు బీఆర్‌టీఎస్ రహదారి మరమ్మతులు :రూ.9.62 లక్షలు
- వంటిల్లు నుంచి మారిట్ హోటల్ వరకు కాంపౌండ్ బ్యూటిఫికేషన్:
- రూ. 4.50 లక్షలు
- ఏపీఎస్ కాలనీ సీతారామరాజు పార్కులో షెడ్డు , పార్కు మరమ్మతులు: రూ.12.70 లక్షలు
- తహసీల్దార్ కార్యాలయం వద్ద సీసీ డ్రైన్ నిర్మాణం: రూ.15 లక్షలు
- బుచ్చిరాజుపాలెం అర్బన్ హెల్త్ సెంటర్ భవనం మరమ్మతులు :రూ.9 లక్షలు
- ఏపీఎస్ఈబీ కాలనీ శివాలయం నుంచి జీవీఎంసీ పార్కు వరకు బీటీ రోడ్డు నిర్మాణం :రూ.19.50 లక్షలు
- ఏపీఎస్ఈబీ కాలనీలో డ్రైన్ల నిర్మాణం: రూ.35 లక్షలు
- లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో డ్రైన్ల నిర్మాణం: రూ.17.20 లక్షలు
- సీతారామరాజు నగర్ పార్కు అభివృద్ధి:రూ.32 లక్షలు
- బస్ట్ షెల్టర్ల నిర్మాణం: రూ.84 లక్షలు



ఎన్ఏడీ నుంచి పెందుర్తి వైపు అద్దంలా మెరుస్తున్న బీఆర్‌టీఎస్ రహదారి

అన్ని వర్గాలకు మేలు



వార్డుల పరిధిలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేలా అభివృద్ధి పనులు చేస్తుండడం గొప్పవిషయం. ప్రజల అవసరాలను గుర్తించి కాలనీల్లో పనులు చేస్తున్నారు. నిధులు కేటాయింపునకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ ఎంతో శ్రద్ధ తీసుకున్నారు.

– చుక్క ప్రసాద రెడ్డి, 90వ వార్డు

డ్రైనేజీలు మెరుగయ్యాయి



మా కాలనీలో చాలా సమస్యలు ఉండేవి. డ్రైనేజీ, కాలువలను బాగు చేయాలని ఎన్నో ఏళ్లుగా అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించుకున్నాం. కానీ గతంలో ఏ ఒక్కరూ కూడా దీనిపై దృష్టి పెట్టలేదు. ఆడారి ఆనంద్ కుమార్ చొరవతో మా కాలనీలో డ్రైనేజీలన్నీ బాగు పడ్డాయి. దుర్వాసన బెడద తప్పింది.

– ఎం.సత్యవతి,

పనులు పూర్తి చేస్తాం



ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున కొత్తగా పనులు మంజూరు చేయడం కుదరదు. వార్డు పరిధిలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ కొనసాగుతాయి. ఇప్పటికే అమల్లో ఉన్న అన్ని రకాల సంక్షేమ పథకాలు యధావిధిగా ప్రజలకు అందిస్తాం. ప్రస్తుతం కొనసాగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులను కూడా పూర్తి చేస్తాం.

– హైమావతి, కమిషనర్,8వ జోన్

క్లుప్తంగా

విశాఖ చేరుకున్న విజయసాయిరెడ్డి



విశాఖ విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న విజయసాయిరెడ్డి

గోపాలపట్నం: రాజ్య సభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నేత విజయసాయిరెడ్డి మంగళవారం సాయంత్రం విశాఖ చేరుకున్నారు. హైదరాబాద్ నుంచి విశాఖ వచ్చిన ఆయనకు పార్టీ నాయకులు సాదరంగా స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి నగరంలోకి రోడ్డు మార్గాన వెళ్లారు.

అంజన్నకు ప్రత్యేక పూజలు



పూజలు అందుకున్న ఆంజనేయస్వామి

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు కరాసలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి ఉదయం పంచామృతాలతో అభిషేకం జరిపించారు. తమలపాకులతో ఆంజనేయస్వామిని అలంకరించారు. భక్తుల పేరిట అర్చకులు గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు అప్పారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

డిజిటల్ బోర్డుపై జీకే బోధన



డిజిటల్ స్క్రీన్ ద్వారా బోధిస్తున్న ఉపాధ్యాయిని

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డులోని మల్కాపురం ఉన్నత పాఠశాలలో 7,8,9 తరగతుల విద్యార్థులకు మంగళవారం డిజిటల్ స్క్రీన్ ద్వారా జనరల్ నాలెడ్జిని బోధించారు. వివిధ సబ్జెక్టులను ఆన్‌లైన్ ద్వారా బోధిస్తున్న ఉపాధ్యాయులు ఇప్పుడు జీకే కూడా విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధన ప్రారంభించారు. ప్రపంచంలోని వింతలు, జంతువుల జీవనాధారాలు, పరికరాలను కనిపెట్టిన సైంటిస్టుల ఫొటోలు, తొలి రైలు ప్రయాణం, విమాన ప్రయాణాలు ఎక్కడ సాగాయి తదితర అంశాలన్నింటినీ డిజిటల్ స్క్రీన్‌పై చూపిస్తూ బోధన చేశారు. ఈ విధంగా బోధన బాగా అర్థమవుతోందని విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జోరుగా ఇంటింటి ప్రచారం



ప్రకాష్‌నగర్ వద్ద ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు జీవీఎస్ఎన్ రాజు

మల్కాపురం: పశ్చిమ నియోజకవర్గ పరిధిలో వైఎస్సార్‌సీపీ ఇంటింటి ప్రచారం మంగళవారం జోరుగా సాగింది. జీవీఎంసీ 61వ వార్డులోని ప్రకాష్‌నగర్, జనతా కాలనీ, ఇండస్ట్రియల్ కాలనీల్లో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు జి.వి.ఎస్.ఎన్.రాజు (కేబుల్ వాసు) పాల్గొని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల సంక్షేమం కోసం అమలు చేసిన వివిధ పథకాలను వివరించారు. గడిచిన ఐదేళ్లలో పేదలు పొందిన లబ్ధిని తెలియజేశారు. సంక్షేమ పథకాల కొనసాగింపునకు వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమాలో పార్టీ నాయకులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

- 58వ వార్డు పిలకవానిపాలెం వద్ద వ్యవసాయ మార్కెటింగ్ బోర్డ్ డైరెక్టర్ చుక్క వరలక్ష్మి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. వరలక్ష్మి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ గెలుపునకు సమష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పి కొట్టాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సత్యనారాయణ రెడ్డి, కోటా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.
- 59వ వార్డు పరిధి నక్కవానిపాలెం వద్ద పార్టీ నాయకుడు సురేష్ ఆధ్వర్యంలో ఇంటించి ప్రచారం చేశారు.

రక్తహీనతపై నిర్లక్ష్యం వద్దు



ర్యాలీలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రతినిధులు

మల్కాపురం: రక్తహీనత సమస్య అధికంగా మహిళల్లో ఉంటుందని, ఈ సమస్యతో బాధపడే వారు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సెయింట్ ఆన్స్ కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకురాలు వి.అంజిలీదేవి సూచించారు.మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం 60వ వార్డు బర్మాకాలనీ,ఇందిరాకాలనీలో రక్తహీనత సమస్యతో బాధపడుతున్న వారి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నిత్యం పౌష్టికాహారం తీసుకోవాలని, తీసుకున్న ఆహారంలో కార్బోహైడ్రేట్స్, విటమిన్స్,మినరల్స్,ప్రొటీన్,ఫైబర్ సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. మినరల్స్ తక్కువ అయితే ఎనీమియా వస్తుందని,విటమిన్ డి తక్కువైతే చర్మ సంబంధిత వ్యాధులు వస్తాయన్నారు. క్రమం తప్పకుండా మంచి ఆహారం తీసుకుంటే ఈ సమస్య నుంచి బయట పడవచ్చునన్నారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికార వై.అనసూయాదేవి తదితరులు పాల్గొన్నారు.

నిర్ణయించిన ధరలకే విక్రయాలు జరపాలి

మార్కెటింగ్ అధికారి షేక్ యాసిన్



పరిశీలిస్తున్న షేక్ యాసిన్

విశాఖ విద్య: రైతు బజారులో నిర్ణయించిన ధరలకే సరకులు విక్రయాలు జరపాలని మార్కెటింగ్ అధికారి షేక్ యాసిన్ సూచించారు. మద్రిపాలెం రైతు బజార్‌ను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. రైతు బజార్‌లోని ప్రతీ దుకాణం వద్దకు వెళ్లి వారు విక్రయిస్తున్న సరుకులను పరిశీలించారు. బోర్డులపై రాసిన విధంగా నిర్ణయించిన ధరలకు కూరగాయలు, ఇతర నిత్యావసరాలు అమ్ముతున్నారా, లేదా అని వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. కూరగాయలు, ఫ్రూట్స్ దుకాణాలు కేటాయించిన చోటే నిర్వహించాలని సూచించారు. తాజా కూరగాయలు అందించేలా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. రైతులతో పాటు వినియోగదారులకు తగిన సౌకర్యాలు కల్పించేలా శ్రద్ధ తీసుకోవాలని ఈవో కొమ్మనాపల్లి వరహాలుకు సూచించారు.

92వ వార్డులో మెజారిటీ కోసం పని చేయాలి



ఆర్య వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావును సత్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డులో వైఎస్సార్‌సీపీకి అధిక మెజారిటీ సాధించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు పిలుపు నిచ్చారు. కుమారి కల్యాణ మండపంలో మంగళవారం వార్డు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ సార్వత్రిక ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించడానికి సైనికుల్లా పని చేయాలన్నారు. ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన పథకాలను వివరించాలన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. గతంతో చంద్రబాబు చేసిన మోసాల్ని, అవినీతిని, జన్మభూమి కమిటీలు అరాచకాలను వివరించాలని సూచించారు. ప్రజలకు మంచి జరగాలంటే మళ్లీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎం కావాల్సిన ఆవశ్యకతను వివరించాలన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో ఆడారి ఆనంద్ కుమార్‌ను గెలిపించుకోవాలని కోరారు. అనంతరం ఇటీవల ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన గుణిశెట్టి శ్రీనివాసరావును నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో 92వ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు, నాయకులు గేదెల మురళీకృష్ణ, బందారు వరలక్ష్మి, గృహసారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

ఖాళీగా ఉండడంతో తప్పిన ముప్పు

పెందుర్తి: సుజాతనగర్ సమీపంలోని ఓ అపార్టమెంట్‌లో మంగళవారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. సుజాతనగర్ సమీపంలోని గొల్లవిల్లివానిపాలెం ప్రశాంతి అపార్ట్‌మెంట్‌లోని ఐదో(ఆఖరి) ఫ్లాట్ చాలా కాలంగా ఖాళీగా ఉంది. మంగళవారం సాయంత్రం ఫ్లాట్‌లో ఉన్న వాషింగ్ మెషిన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఫ్లాట్ మొత్తం మంటలు వ్యాపించాయి. దీంతో అపార్ట్‌మెంట్‌లోని మిగిలిన ఫ్లాట్లలో నివాసం ఉంటున్న వారు భయాందోళనతో బయటకు వచ్చేశారు. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. మర్రిపాలెం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే ఆ ఫ్లాట్‌లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

23న మెన్ డబుల్స్ బ్యాడ్మింటన్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: మెన్ డబుల్స్ బ్యాడ్మింటన్ పోటీలు ఈనెల 23,24వ తేదీల్లో ఏవీఎన్ కళాశాలలో జరగనున్నాయి. నాకవుట్ పద్ధతిలో 30 పాయింట్లతో మ్యాచ్ నిర్వహించనుండగా... క్వార్టర్ ఫైనల్స్‌నుంచి బెస్ట్ ఆఫ్ త్రీగా పోటీలు జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు.

సింహగిరిపై విశేషంగా హోమం



ప్రధాన కలశంతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు



సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులు

సింహాచలం: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై గంగధార సమీపంలోని ప్రాచీన రామాలయంలో మంగళవారం హోమం విశేషంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని మండపంలో సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను అధిష్టంపజేశారు. హోమ గుండం వద్ద విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, కలశారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం , పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం కుంభప్రోక్షణ జరిపారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని ఆలయ అర్చకుడు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామివారి మూలవిరాట్‌కు సమర్పించారు. అర్చకులు చిన్నా తదితరులు హోమం నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి సతీసమేతంగా కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేత్రపర్వంగా సహస్ర కలశాల శోభాయాత్ర



కలశాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు లక్ష్మీపురంలో దుర్గాలమ్మ, నూకాలమ్మ, పోలిపిల్లిమ్మ అమ్మవార్ల ఆలయ ప్రారంభోత్సవంలో భాగంగా మంగళవారం మహిళలు సహస్ర కలశాలతో శోభాయాత్ర నిర్వహించారు. దేవతా మూలమంత్ర హోమాలు, ధాన్యాధివాసం, నీరాజన మంత్ర పుష్పాలు, వేదస్వస్తి కార్యక్రమాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో, ప్రధాన అర్చకులు ఇరగవరపు వాసు శ్రీధర్ స్వాముల పర్యవేక్షణలో నిర్వహించారు. సాయంత్రం కోలాటాలు, తప్పెటగుళ్లతో అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. 20వ తేదీన యంత్ర, విగ్రహ, శిఖర ప్రతిష్ట, మహా పూర్ణాహుతి, సారె ఊరేగింపు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు అవిరెడ్డి సూర్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో కుచ్చర్లపాటి రామరాజు, సెక్రటరీ సిరసపల్లి బాబూరావు, అప్పికొండ పెంటారావు, బెల్లంకొండ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.